క్లుప్తంగా

పంచాయతీ కార్యదర్శిపై చర్యలు తీసుకోండి



గ్రామ పంచాయతీ ఎదుట ఆందోళన చేస్తున్న గ్రామస్తులు

చేర్యాల(సిద్దిపేట): మండల పరిధిలోని పోతిరెడ్డిపల్లి పంచాయతీ పరిధిలో 2017 నుంచి వసూలు చేసిన ఇంటిపన్ను, నల్లా బిల్లులను గ్రామ పంచాయతీ ఖాతాలో జమ చేయకుండా సొంతానికి వాడుకున్న కార్యదర్శిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని పలువురు గ్రామస్తులు గురువారం ఆందోళన చేశారు. గతంలో జిల్లా పంచాయతీ అధికారి, ఎంపీడీఓ, మండల పంచాయతీ అధికారి దృష్టికి తీసుకువెళ్లిన పట్టించుకోవడం లేదని ఆరోపించారు. డీఎల్‌పీఓ వచ్చి విచారణ చేసి రికవరీ చేస్తామని చెప్పి రెండేళ్లు గడిచినా ఇప్పటికీ ఎలాంటి ఫలితం లేదన్నారు. దీనిపై కలెక్టర్ స్పందించాలని కోరారు. ఆందోళనలో కత్తుల భాస్కర్‌రెడ్డి మల్లయ్య, అశోక్, బాల్‌రెడ్డి, నర్సింహారెడ్డి, కొండయ్య, తిరుపతి, బుచ్చయ్య పాల్గొన్నారు.

నాణ్యమైన బోధన అందించాలి



దివ్యాంగ పిల్లలకు పండ్లు పంపిణీ చేస్తున్న ఉపాధ్యాయులు

హుస్నాబాద్: పట్టణంలోని భవిత పాఠశాలలో గురువారం దివ్యాంగుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రిన్సిపల్ సివిల్ జడ్జి శివరంజని హాజరై మాట్లాడారు. దివ్యాంగులకు ఆటపాటలతో పాటు నాణ్యమైన బోధన అందించాలని సూచించారు. కార్యక్రమంలో న్యాయవాదులు ప్రవీణ్, సంపత్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కొబ్బరికాయలు కొట్టి.. మొక్కు తీర్చుకుని



కొబ్బరికాయ కొడుతున్న రాంచంద్రారెడ్డి

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): ముఖ్యమంత్రిగా రేవంత్‌రెడ్డి ప్రమాణ స్వీకారం చేసిన సందర్భంగా తెలంగాణ ప్రగతి వేదిక కన్వీనర్ అమ్మన రాంచంద్రారెడ్డి మొక్కు తీర్చుకున్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని మోహిని పూర వెంకటేశ్వర ఆలయంలో 101 కొబ్బరికాయలు కొట్టి రేవంత్‌రెడ్డి పేరు మీద అర్చన, ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు భాస్కర్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, ధర్మారెడ్డి, గోపిరెడ్డి, రామోజీ, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం రేవంత్‌రెడ్డికి శుభాకాంక్షలు



ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో సిద్దిపేట కాంగ్రెస్ నాయకులు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): నూతన ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన రేవంత్‌రెడ్డిని గురువారం హైదరాబాద్‌లో సిద్దిపేట కాంగ్రెస్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసినట్లు సిద్దిపేట కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు అత్తుఇమామ్ తెలిపారు. జిల్లా అధ్యక్షుడు నర్సారెడ్డి ఆధ్వర్యంలో ముఖ్యమంత్రిని కలిసి శుభాకాంక్షలు తెలిపినట్లు చెప్పారు. కార్యక్రమంలో సిద్దిపేట యువజన విభాగం పట్టణ అధ్యక్షుడు గయాజుద్దీన్, రాశాద్, తదితరులు పాల్గొన్నట్లు తెలిపారు.

మెరుగైన ఫలితాలే లక్ష్యం

చేర్యాల(సిద్దిపేట): మెరుగైన ఫలితాలే లక్ష్యంగా ఉపాధ్యాయులు పనిచేయాలని మండల పరిధిలోని ముస్త్యాల సర్పంచ్ పెడతల యెల్లారెడ్డి పేర్కొన్నారు. గురువారం ప్రభుత్వ పాఠశాల పదో తరగతి విద్యార్థులకు బయోసైన్స్ బోధించేందుకు ఎంపీటీసీ సభ్యురాలు ఎండీ. ఖమర్‌సుల్తానా భర్త ఎండీ. అతార్ అహ్మద్ సొంతంగా రూ. 10 వేలు చెల్లించి ప్రైవేట్ టీచర్‌ను నియమించాడు. ఈసందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. పదో తరగతి విద్యార్థులకు వార్షిక పరీక్షలు దగ్గర పడుతుండడం, బయోసైన్స్ బోధించే ఉపాధ్యాయుడు లేకపోవడంతో అతార్ ముందుకు వచ్చి టీచర్‌ను నియమించడం అభినందనీయమని కొనియాడారు.

వాన.. రైతన్న హైరానా!



మర్పడ్గ శివారులో ధాన్యం కుప్పలపై నిలిచిన వర్షం నీరు



సిర్సనగండ్లలో తడిసిన ధాన్యాన్ని ఆరబెట్టిన రైతులు

- పంట చేతికందే సమయంలో నష్టం
- ప్రారంభం కాని ధాన్యం కొనుగోళ్లు

కొండపాక(గజ్వేల్): మిచాంగ్ తుఫాన్ రైతులకు కంటి మీద కునుకు లేకుండా చేస్తోంది. ఆరుగాలం కష్టపడి పండించిన పంట చేతికందే సమయంలో నష్టాన్ని తెచ్చిపెడుతోంది. కొండపాక, కుకునూరుపల్లి మండలాల్లో సుమారు 25 వేల ఎకరాల్లో రైతులు వరి సాగు చేశారు. పక్కనే మల్లన్నసాగర్ ప్రాజెక్టు, చెరువుల్లో నీటి నిల్వలు ఎక్కువగా ఉండడంతో రైతులు వరి వైపు మొగ్గు చూపారు. గతేడాది కంటే కాస్త ఆలస్యంగా పంట చేతికందుతుండడంతో కూలీలు, హార్వెస్టర్ల కొరతతో పనులు మెల్లగా సాగుతున్నాయి. కోసిన పంటను రైతులు రోడ్లపైనే కుప్పలు పోసుకున్నారు. కొనుగోళ్లు ప్రారంభం కాకపోవడంతో వారం రోజులుగా రోడ్లపైనే ధాన్యం కుప్పలు పేరుకుపోయాయి. రెండు, మూడు రోజులుగా తుఫాన్ ప్రభావంతో వర్షాలు కురుస్తుండటంతో ధాన్యం తడిసిముద్దయింది. దీంతో రైతులు తీవ్ర ఇబ్బంది పడుతూ తడిసిన ధాన్యాన్ని వేరు చేస్తూ ఆరబెడుతున్నారు. ఇదిలా ఉండగా కోత దశకు చేరుకున్న పంట చేనులోనే ఉండడంతో వర్షానికి నేలవాలి దెబ్బతినే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ప్రజాప్రతినిధులు, అధికారులు పెద్దగా కొనుగోళ్లపై దృష్టి పెట్టలేకపోయారు. నూతనంగా ఏర్పడిన ప్రభుత్వం కొనుగోళ్లను వేగవంతం చేసి ఆదుకోవాలని కోరుతున్నారు.

హరీశ్‌రావును కలిసిన నాయకులు

కొండపాక(గజ్వేల్): మాజీ మంత్రి హరీశ్‌రావును బీఆర్‌ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు నూనె కుమార్ ఆధ్వర్యంలో నాయకులు గురువారం కలిశారు. సిద్దిపేట, గజ్వేల్ అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ భారీ మెజార్టీతో గెలవడంతో పాటు వరుసగా ఏడు పర్యాయాలు విజయం సాధించడంపై సిద్దిపేటలోని క్యాంపు కార్యాలయంలో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అలాగే మండల పరిధిలోని మర్పడ్గలో ఇటీవల పాముకాటుతో మృతిచెందిన ఆకారం కనుకవ్వ కుటుంబానికి బీఆర్‌ఎస్ తరుపున మంజూరైన రూ. 2 లక్షల ఇన్సూరెన్స్ చెక్కును కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో జాగృతి రాష్ట్ర కార్యదర్శి అనంతుల ప్రశాంత్, రైతు బంధు సమితి మాజీ మండల కోఆర్డినేటర్ ర్యాగల్ల దుర్గయ్య, మాజీ ఎంపీపీలు బైరెడ్డి రాధాకిషన్‌రెడ్డి, బొద్దుల కనకయ్య, ఆత్మ కమిటీ మాజీ డైరెక్టర్ పద్మ, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలకు అండగా ఉంటాం..

సిద్దిపేటజోన్: బీఆర్‌ఎస్ కార్యకర్తల కుటుంబాలకు అండగా ఉంటామని, వారిని పార్టీ కాపాడుకుంటుందని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు పేర్కొన్నారు. గురువారం క్యాంపు కార్యాలయంలో ఇటీవల ప్రమాదవశాత్తు మృతిచెందిన కార్యకర్తలకు సంబంధించిన బీమా చెక్కులను అందజేశారు. నియోజకవర్గంలో 2017 నుంచి 2023 వరకు సభ్యత్వం పొందిన వారిలో ప్రమాదవశాత్తు 60 మంది మృతిచెందారని, వారికి ఒక్కొక్కరికి రెండు లక్షల చొప్పున బీమా డబ్బులు అందజేశామన్నారు. అంతకు ముందు ఇటీవల ఎన్నికల్లో సిద్దిపేట ఎమ్మెల్యేగా గెలిచిన సర్టిఫికెట్‌ను ఎన్నికల ఏజెంట్ మోహన్‌లాల్ హరీశ్‌రావుకు అందించారు.



మాజీ మంత్రి హరీశ్‌రావుకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న నాయకులు

ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తా

- దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి

మిరుదొడ్డి(దుబ్బాక): ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తానని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి అన్నారు. గురువారం అక్బర్‌పేట-భూంపల్లి మండల పరిధిలోని మోతెలో అభయాంజనేయ స్వామి ఆలయ 10వ వార్షికోత్సవంలో పాల్గొన్నారు. రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్యతో కలిసి స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దుబ్బాక ప్రజల దీవెనతో ఎమ్మెల్యేగా గెలుపొందానని.. పట్టణాలకు ధీటుగా పల్లెలను అభివృద్ధి చేస్తానన్నారు. దుబ్బాక నియోజకవర్గాన్ని అన్నిరంగాల్లో తీర్చిదిద్దడానికి పార్టీలకతీతంగా సహకరించాలని కోరారు. భక్తిభావన కలిగిన పల్లెలు ప్రశాంతతకు నిలయాలుగా మారుతాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ కాలేరు శ్రీనివాస్, అక్బర్‌పేట- భూంపల్లి మండల బీఆర్‌ఎస్ అధ్యక్షుడు జీడిపల్లి రవి, నాయకులు రంజిత్, రాజేశ్వర్, భీంరావు తదితరులు పాల్గొన్నారు.



పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి

వసతి గృహాల్లో కార్పొరేట్ స్థాయి వసతులు

కోహెడరూరల్(హుస్నాబాద్): సంక్షేమ వసతి గృహాల్లో విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి వసతులు కల్పిస్తున్నట్లు మండలంలోని శనిగరం ఎస్సీ వసతి గృహం వార్డెన్ పోగుల రాజు తెలిపారు. గురువారం వసతి గృహంలో విద్యార్థులకు స్వెటర్లు, బ్లాంకెట్స్, షూలు అందజేశారు. చలికాలంలో విద్యార్థులు పడొద్దని జిల్లా షెడ్యూల్ కులాల అభివృద్ధి అధికారి ఆదేశాలతో సామగ్రిని అందజేసినట్లు చెప్పారు.



స్వెటర్లు, బ్లాంకెట్స్‌తో విద్యార్థులు

గ్రామాల్లో ఆరోగ్య సర్వే

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని ధర్మాసాగర్, ముట్రాజ్‌పల్లి గ్రామాల్లో వైద్య సిబ్బంది, ఐసీడీఎస్ అధికారులు ఐసీఎంఆర్ (ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్) ఆధ్వర్యంలో గురువారం సర్వే నిర్వహించారు. ఐసీఎంఆర్ మెడికల్ ఆఫీసర్ జయప్రకాష్ ఆధ్వర్యంలో ఆయా గ్రామాల్లో ఇంటింటికీ తిరిగి సర్వే చేశారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, ఐసీఎంఆర్ అధికారులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి

బెజ్జంకి(సిద్దిపేట): గ్రామాల్లో ప్రజా సమస్యలు గుర్తించి పరిష్కారానికి కృషి చేయాలని బెజ్జంకి ఎంపీపీ లింగాల నిర్మల సూచించారు. బెజ్జంకి మండల పరిషత్ కార్యాలయంలో గురువారం నిర్వహించిన మండల పరిషత్ సర్వసభ్య సమావేశానికి ఆమె అధ్యక్షత వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ.. కోట్లాది రూపాయలతో మౌలిక వసతులు, అభివృద్ధి పనులు చేశామని, ఇంకా సమస్యలుంటే సమష్టిగా కృషి చేసి సత్వరం పరిష్కరిద్దామని పేర్కొన్నారు. పలువురు సర్పంచ్‌లు మాట్లాడుతూ.. తమకు రావాల్సిన అభివృద్ధి పనుల, ఈజీఎస్ బిల్లులు ఇప్పించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీఓ దమ్మని రాము, ఏఎంసీ చైర్మన్ కచ్చు చంద్రకళ, పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీపీ నిర్మల

మార్కెట్ పాలకవర్గం రాజీనామా



సిబ్బందికి రాజీనామా పత్రాన్ని అందజేస్తున్న జహంగీర్

ములుగు(గజ్వేల్): మండలంలోని వంటిమామిడి మార్కెట్ కమిటీ పాలకవర్గం రాజీనామ చేసింది. ఈమేరకు గురువారం మార్కెట్ కమిటీ చైర్మన్ జహంగీర్, వైస్ చైర్మన్ భూపాల్‌రెడ్డితో పాటు డైరెక్టర్లు తమ రాజీనామా పత్రాన్ని మార్కెట్ కమిటీ సిబ్బందికి అందజేశారు. ఈసందర్భంగా చైర్మన్ జహంగీర్ మాట్లాడుతూ.. మాజీ సీఎం కేసీఆర్ ప్రభుత్వ హయాంలో మార్కెట్ యార్డును అన్ని విధాలుగా అభివృద్ధి చేశామన్నారు. మార్కెట్ యార్డు విస్తరణకు ఇప్పటికే 70 ఎకరాల భూమి సేకరించామని తెలిపారు. గిడ్డంగులు, తదితర నిర్మాణాల కోసం రూ. 100 కోట్లు మంజూరైనట్లు చెప్పారు. కొత్తగా అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం మార్కెట్ అభివృద్ధికి పాటుపడి రైతులకు సమస్యలు రాకుండా చూడాలని కోరారు.

ఆడపిల్లలను వేధిస్తే కఠిన చర్యలు



ఎస్సైని సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

అక్కన్నపేట(హుస్నాబాద్): మండలంలోని మల్లంపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో షీటీమ్‌పై గురువారం విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఎస్సై తాండ్ర వివేక్, హెచ్‌ఎం గుగులోతు రంగనాయక్ మాట్లాడుతూ.. బాలికల భద్రతే షీటీమ్ లక్ష్యమన్నారు. పాఠశాలలో కానీ, బయట ఎక్కడైన ఆకతాయిలు వేధించినా, ఇబ్బందికరంగా మాట్లాడిన వెంటనే టోల్ ఫ్రీ నంబర్ 100, 181కు సమాచారం ఇవ్వాలన్నారు. బాలికలు, మహిళలను వేధింపులకు గురిచేస్తే చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పిల్లల ప్రవర్తనపై దృష్టి సారించాలని సూచించారు. కార్యక్రమంలో షీటీమ్ డివిజన్ కో-ఆర్డినేటర్ సదయ్య, సభ్యులు కృష్ణ, ప్రత్యూష, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ శ్రేణుల సంబరాలు



చేర్యాలలో కాంగ్రెస్ నాయకుల సంబరాలు



హుస్నాబాద్ పట్టణంలో..

చేర్యాల(సిద్దిపేట)/హుస్నాబాద్: రాష్ట్ర నూతన సీఎంగా రేవంత్‌రెడ్డి ప్రమాణస్వీకారం చేసిన సందర్భంగా గురువారం పట్టణ కేంద్రంలో కాంగ్రెస్ నాయకులు బాణాసంచా కాల్చి సంబరాలు చేసుకున్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్ చెవిటి లింగం, నాయకులు కొమ్ము నర్సింగరావు, ముస్త్యాల యాదగిరి, దాసరి శ్రీకాంత్, అంబాల రాములుగౌడ్, ఎండీ. ఖాజా, కాటం శ్రీనివాస్, ఎండీ. జహీర్, తాటిపాముల పర్శరాములుగౌడ్ తదితరులు పాల్గొన్నారు. అలాగే పొన్నం ప్రభాకర్ పదవీ ప్రమాణ స్వీకారం చేసిన సందర్భంగా హుస్నాబాద్ పట్టణంలో కాంగ్రెస్ నాయకులు సంబరాలు నిర్వహించారు. టపాసులు కాల్చి స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బంక చందు, కౌన్సిలర్ చిత్తారి పద్మ, నాయకులు బాలయ్య, వెన్న రాజు, పోశెట్టి, రజిత, రాధా, గాజుల చంద్రయ్య, సాంబరాజు, సంఘ కుమార్, శ్రీధర్, శ్రీకాంత్‌రెడ్డి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమకారులను ఆదుకోవాలి

హుస్నాబాద్: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రిగా పొన్నం ప్రభాకర్ ప్రమాణ స్వీకారం చేసిన సందర్భంగా గురువారం పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో తెలంగాణ ఉద్యమకారుల ఫోరం, కళాకారులు, మహిళా ఫోరం పక్షాన డాక్టర్ సీమ శ్రీనివాస్ హర్షం వ్యక్తం చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ ఉద్యమకారులకు 250 గజాల ఇంటి స్థలం ఇస్తామని రాహుల్ గాంధీ హామీ ఇచ్చారని, హామీని నిలబెట్టుకుంటారని ఆకాంక్షించారు. కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమ కళాకారుల ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు బత్తుల చంద్రమౌళి, నాయకులు బత్తుల రవీందర్, శ్రీనివాస్, బాలు, కిషోర్, రాజేష్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కళాకారులు

పర్యవేక్షణలోపం.. ప్రయాణికులకు శాపం

దుబ్బాక: దుబ్బాక పట్టణంలోని బస్టాండ్ నిర్వహణ అధ్వానంగా మారింది. మరుగుదొడ్ల నిర్మాణం సరిగా లేక ప్రయాణికులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. అధికారుల పర్యవేక్షణ లోపం కారణంగానే మరుగుదొడ్లు ధ్వంసమయ్యాయని ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి మరుగుదొడ్ల మరమ్మతులు చేయించి సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు.



ధ్వంసమైన మరుగుదొడ్డి



మరుగుదొడ్డికి తాళం వేసిన దృశ్యం



దుబ్బాక బస్టాండ్

రైతులు వరికొయ్యలు కాల్చొద్దు



రైతులకు అవగాహన కల్పిస్తున్న కేవీకే విద్యార్థులు

కౌడిపల్లి(నర్సాపూర్): వరిపంట కోసిన తర్వాత కొయ్యలను కాల్చొద్దని కేవీకే శిక్షణ విద్యార్థులు రైతులకు సూచించారు. గురువారం మండలంలోని తునికి వద్ద ఉన్న డీ. రామానాయుడు ఏకలవ్య గ్రామీణ వికాస ఫౌండేషన్ కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే)లో వ్యవసాయ శిక్షణ విద్యార్థులు మండలంలోని వెల్మకన్న గ్రామంలో రైతులకు యాసంగి పంటల సాగుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రైతులు వరి కొయ్యలను కాల్చివేయడం వల్ల భూసారం తగుతుందన్నారు. నేలపైన ఉన్న జీవరాశులు, మిత్ర పురుగులు చనిపోతాయని దీంతో రైతులకు నష్టం కలుగుతుందన్నారు. దీంతో పాటు వాయుకాలుష్యం పెరుగుతుందని, భూమిలో కలియ దున్నడంవల్ల భూసారం పెరుగుతుందన్నారు. భూసార పరీక్షల ఆధారంగా రసాయన ఎరువులు వాడాలని, మోతాదుకు మించి ఎరువులు, క్రిమిసంహారక మందులు వాడొవద్దన్నారు. విత్తన శుద్ధి చేయాలని, రైతులు సేంద్రియ సాగు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శిక్షణ విద్యార్థులు పూజిత, హారిక, రుచిత, సౌమ్య, మేఘన, ప్రణతి గ్రామస్తులు, రైతులు పాల్గొన్నారు.